క్లుప్తంగా

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి లక్షా 11వేల 244 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం హసన్‌పల్లి, నర్వ గ్రామాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ శనివారం తనిఖీ చేశారు. తరగతుల వారీగా బోధన వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులున్నారు.

ఘనంగా దర్గా వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ శివారులోఉన్న వెంకటఖాజా షిస్తీ దర్గా వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వట్‌పల్లి పీఠాధిపతి ముకుందరావు షిస్తీ ఆధ్వర్యంలో ఆత్మకూర్‌కు చెందిన జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి దర్గాకు గంధం సమర్పించారు. దీంతోపాటు దర్గా వద్ద కవాలి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి



బాన్సువాడ : బీర్కూర్ మండలం దామరంచలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని శనివారం నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్, నాయకులు కాంత్‌రెడ్డి, తోట నారాయణ, సాయిలు, గంగాధర్, లక్ష్మీనారాయణ, ఆసిఫ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో సీసీరోడ్లు



బాన్సువాడ రూరల్: జిల్లాపరిషత్ నిధులతో తాడ్కోల్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభించినట్లు బాన్సువాడ జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామ సర్పంచ్ కుమ్మరి రాజమణి, ఎంపీటీసీ ఇందిర, డీసీసీబీ డైరెక్టర్ భూషణ్‌రెడ్డితో కలిసి ఒకటో వార్డులో రూ.2లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. నాయకులు కుమ్మరి రాజు, నూకల రాజు, లక్ష్మణ్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, అంజలి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు

పశువైద్య శిబిరం



బాన్సువాడ రూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఇబ్రాహీంపేట్‌లో శనివారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువైద్యశాల ఏడీ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 18 గేదెలకు గర్భకోశ టీకాలు, 37 దూడలకు నట్టల నివారణ మందు ఇచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు టీకాలు వేశారు. పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి, ఎంపీటీసీ కళావతి హన్మాండ్లు సందర్శించారు. సిబ్బంది వెంకటేశ్, సంధ్య, మహేశ్, ప్రవీణ్, సాయిలు, విఠల్, పాడి రైతులు పాల్గొన్నారు.

శ్రీరామకోటి కార్డుల పంపిణీ



కామారెడ్డి అర్బన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీరామ జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి శనివారం ఆలయాల వద్ద భక్తులకు శ్రీరామకోటి కార్డులను పంపిణీ చేశారు. శ్రీరామ నామాలను కోటి రాయించి భద్రాచలం రామచంద్రునికి సమర్పించనున్నట్టు ఆయన తెలిపారు.

ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు

- అవినీతికి పాల్పడితే ఊరుకోం
- తీరు మారకుంటే చర్యలు తప్పవు
- కామారెడ్డికి ఆదర్శ బల్దియాగా పేరు తీసుకొద్దాం
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే కేవీఆర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు, అధికారులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కౌన్సిలర్లు, అధికారులు కృషి చేయాలని, అవినీతిని సహించేది లేదని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఇప్పటి వరకు జరిగిన దానిని మర్చిపోవాలని, ఇకనుంచి ప్రజలను ఇబ్బందులు పెట్టినా.. తీరు మార్చుకోకపోయినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కౌన్సిల్‌హాల్‌లో చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా మొదటిసారి రావడంతో ఎమ్మెల్యేను చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు సన్మానించారు. అనంతరం ఎజెండా అంశాలపై చర్చను ప్రారంభించారు. 25వ వార్డు కౌన్సిలర్ అంజల్‌రెడ్డి ఓ భవన నిర్మాణాలపై టీపీవోను నిలదీసిన క్రమంలో వేరే ఉద్దేశంతో అధికారులకు ఒత్తిళ్లు తీసుకురావద్దని ఆయన కౌన్సిల్ సభ్యులందరిని హెచ్చరించారు. ఆక్రమణలు, కబ్జాలను ఉపేక్షించేది లేదని టీపీవో గిరిధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యుడిగా ఉన్ననాడే కబ్జాలు, అవినీతి, ఆక్రమణలపై తాను పోరాటం చేశానని, ప్రస్తుతం ఎమ్మెల్యే హోదాలో ఉన్నానని తనదైన మాటలతో చురకలంటించారు. ప్రతి నెలా మొదటి తేదీన మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు ఇచ్చిన తర్వాతే కాంట్రాక్టర్లకు, ఇతర బిల్లులు చెల్లించాలని సూచించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఇదే సభ్యులు గెలవాలని కోరుకుంటానని అన్నారు. వచ్చే సమావేశంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు తనకు అందవద్దన్నారు.

సమావేశం వాయిదా

చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి బంధువు ఒకరు శనివారం మృతి చెందారు. అంత్యక్రియలకు ఆమె వెళ్లాల్సి ఉండడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ దేవేందర్, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పార్టీలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయవద్దని, అవినీతికి పాల్పడవద్దని అన్నారు. ఎమ్మెల్యేను ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీడీవో లక్ష్మి, సర్పంచులు సన్మానించారు.

కాలనీ పరిశీలన

బీసీ కాలనీతోపాటు బస్టాండ్ ఆవరణను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరిశీలించారు. బస్టాండ్ నిర్మాణం కారణంగా బీసీ కాలనీవాసులకు ఇబ్బంది ఉందని స్థానికులు తెలిపారు. ఆయనవెంట కౌన్సిలర్ మహేశ్వరి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తదితరులున్నారు.

హామీని నెరవేర్చాలి

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చుతామని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందని, హామీని నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కోరారు. ఎమ్మెల్యేను సన్మానించి విన్నవించారు. ముదిరాజ్ సంఘం నాయకులు విఠల్, తూర్పురాజు, సంతోష్, రమేశ్, సాయికుమార్ తదితరులున్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



బాన్సువాడ : జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం బీర్కూర్‌లో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతు పెండ్యాల సాయిలును సన్మానించారు. లయన్స్ క్లబ్ బీర్కూర్ అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సంతోష్, పోశెట్టి, శ్రీకాంత్, నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల తనిఖీ



పిట్లంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పిట్లం/నిజాంసాగర్(జుక్కల్): పిట్లం, మద్నూర్ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లోని సిబ్బంది వివరాలను తెలుసుకోవడంతోపాటు స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిట్లం ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకు ముందు పిట్లం మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట పిట్లం మండల కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి దొర, పాష, ఆదిల్, అద్నాన్, మహ్మద్ తదితరులున్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలి



కామారెడ్డి టౌన్: జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ తనకు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మురళీధర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో పార్టీ అధిష్టానాన్ని కలిశారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు సీనియర్‌గా తనకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితోపాటు ఇతర నాయకులను కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి నేత బాణాల లక్ష్మారెడ్డి ఉన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీఎం పెన్షన్ అధికారి సురేశ్

రాజంపేట: మహిళా సంఘాలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం పెన్షన్ అధికారి సురేశ్ అన్నారు. రాజంపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సుతారి లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమాఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంకు లింకేజీ స్త్రీనిధి గ్రామ సంఘం రుణాలు రికవరీ, కొత్త రుణాల మంజూరు గురించి వివరించారు. ఇప్పటి వరకు రూ.కోటీ 50లక్షల స్త్రీనిధి రుణాలు అందజేశామన్నారు. పీఎం ఎఫ్‌ఎంఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, 35శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. డీఎం జీ రాము, సీసీలు శ్రీనివాస్, సాయిలు, రమేశ్, బాగయ్య, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి, గ్రామ సంఘాల ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అయోధ్య రామమందిరం నుండి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా సహకార్యదర్శి బొల్లి రాజు కోరారు. మండలకేంద్రంలోని వైశ్యసంఘం కల్యాణమండపంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన హిందూసోదరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్య రామమందిరంలోని శ్రీరాముని పాదాలను స్పృశించిన అక్షింతలను గ్రామగ్రామానికి చేర్చాలని అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ నిర్ణయించిందన్నారు. జనవరి 15వ తేదీలోగా రామమందిర అక్షింతల పంపిణీని పూర్తిచేయాలన్నారు. ఇందుకోసం మండల, గ్రామస్థాయిల్లో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ ఎల్లారెడ్డి కన్వీనర్ వినోద్, మండల కన్వీనర్ భూపతి రాజుతోపాటు పలుగ్రామాలకు చెందిన హిందూసోదరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి



ప్రత్యేకావసరాలు గల బాలుడితో ఎంఈవో ఎల్లయ్య

కామారెడ్డి రూరల్: సీడబ్ల్యూఎస్ఎన్(ఎఎస్‌సీ) సర్వేలో భాగంగా మున్సిపల్ పరిధిలోని సరంపల్లిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లవాడిని గుర్తించి సరంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో ఎల్లయ్య శనివారం చేర్పించారు. బడిబయటి పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాలని, చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిబయటి పిల్లల గుర్తింపు సర్వేలో సీఆర్‌పీ చిరంజీవి, ఐఈఆర్‌పీ భక్తమాల తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండలంలో..

నిజాంసాగర్/మాచారెడ్డి : నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, ఆరేడ్, లింగంపల్లి,మర్పల్లి, పెద్ద ఆరేపల్లి, చిన్న అరేపల్లి గ్రామాల్లో క్లస్టర్ సీఆర్పీ వరలక్ష్మి బడిబయట ఉన్న పిల్లల గుర్తింపునకు సర్వే చేపట్టారు. ఆరు నుంచి పదోతరగతి వరకు, ఇంటర్మీడియెట్ గ్రూప్ పిల్లలను 11 మందిని గుర్తించి వారిని ఓపెన్ పాఠశాల, కళాశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడారు. మాచారెడ్డి మండలం అంకిరెడ్డిపల్లి తండాకు చెందిన బాలుడు సురేశ్ ఆరోతరగతి మధ్యలో బడిమానేసినట్లు సీఆర్పీ సంజీవ్ గుర్తించి బడిలో చేర్పించారు. హెచ్‌ఎం ఆంజనేయులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి



ప్రథమ బహుమతి పొందిన సాయి విజ్ఞాన్ విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరూ రోజూ భగవద్గీత చదవాలని సామాజిక సమరసత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజకులు, అఖిల భారత కళామండలి ప్రముఖ్ అప్పాల ప్రసాద్ అన్నారు. మండలంలోని లింగంపల్లి కృష్ణ మందిరంలో సామాజిక సమరసత వేదిక, శ్రీ కృష్ణ మందిరం ఆధ్వర్యంలో శనివారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. సందర్భంగా సామూహిక గీతా పఠనం, గీతా శ్లోక పఠన స్పర్థలు, ప్రవచన కార్యక్రమ, భజన కీర్తన స్పర్థలపై పోటీలు నిర్వహించారు. సామూహిక గీతా పఠనంలో ప్రథమ బహుమతిని పద్మాజివాడి సాయి విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు కేవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతిని బాల సంస్కార్ శిబిరం విద్యార్థులు, తృతీయ బహుమతిని పొల్కంచ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతులు మచాలే బాబా, కన్హైరాజ్ బాబా, జయరాజ్ బాబ, డాక్టర్ రాంసింగ్, పోతంగల్ కిషన్‌రావు, సారంగ్‌బాబా, సర్పంచ్ గుండెల్లి సాయిలు, ఉప సర్పంచ్ దామోదర్‌రావు, వెంకట్‌రావు, శంకర్‌రావు, భూంరావు, రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కనిపించని జీపీ సిబ్బంది



పిట్లం(జుక్కల్): మండల కేంద్రమైన పిట్లం గ్రామ పంచాయతీ కార్యాలయం సిబ్బంది శనివారం 12గంటల దాటిపోయినా రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారికి సమాధానం ఇచ్చేందుకు ఎవరూ లేకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పన్ను చెల్లింపు, ధ్రువీకరణపత్రాల కోసం వచ్చిన వారు సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఎవరూ లేరనే విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాలని చూడగా, సర్పంచ్ కుర్చీ సైతం ఖాళీగా దర్శనమివ్వడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా, సర్టిఫికెట్లకోసం గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చేవారిని కంప్యూటర్ ఆపరేటర్ దొడ్డిదారిన దోచుకుంటున్నాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా బర్త్ సర్టిఫికెట్‌కోసం వస్తే జీపీకి ఎదురుగా ఉన్న జిరాక్స్ సెంటర్‌కు వారిని పంపిస్తున్నాడని, సదరు సెంటర్ నిర్వాహకుడు ఒక్కో ఫాంకు రూ.50 తీసుకుంటున్నాడని తెలిసింది. అయితే దీంతో కంప్యూటర్ ఆపరేటర్ వాట ఎంతో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి



దేవునిపల్లి సత్యనారాయణస్వామి ఆలయంలో..



చుక్కాపూర్ ఆలయంలో..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. కామారెడ్డిలోని పంచముఖి హనుమాన్, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సాక్షి నెట్‌వర్క్



నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో..



రాజంపేట వేంకటేశ్వర ఆలయంలో..



భిక్కనూరు వేంకటేశ్వరాలయంలో..



కామారెడ్డిలోని వేణుగోపాలస్వామి గుడి వద్ద భక్తుల క్యూ



కామారెడ్డి పంచముఖి హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు



తాడ్వాయిలో పల్లకీసేవ..

విచారణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పీ రవి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై విచారణకోసం తమ సిబ్బందికి సహకరించాలని ఎస్‌ఆర్‌పీ(స్టేట్ రిసోర్స్ పర్సన్) రవి అన్నారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట మండలంలో గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు చేపట్టిన ఉపాధి పనులపై 14వ విడత సామాజిక తనిఖీ చేపట్టనున్నామన్నారు. ఉపాధిహామీ పథకం కింద నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.3కోట్ల విలువైన పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఆదివారం నుంచి గ్రామాల్లో తనిఖీలు ప్రారంభమవుతాయన్నారు. తనిఖీలు పూర్తయిన తర్వాత గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తామని, దీంతోపాటు మండలకేంద్రంలో ఈ నెల 29న ప్రజావేదిక నిర్వహిస్తామని ఆయన తెలిపారు. తనిఖీ కోసం సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్య దర్శులు సహకరించాలన్నారు. ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏపీవో సాయిలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలితో ఫొటో



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డిలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన క్రాస్‌కంటి ముగింపు కార్యక్రమానికి హాజరై తన వాహనం వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యే కేవీఆర్‌తో ఫొటో దిగుతానని మున్సిపల్ కార్మికురాలు జ్యోతి కోరింది. కళాభారతిలో పనిచేస్తున్న మరో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని రవళి సైతం ఎమ్మెల్యేతో ఫొటో దిగడానికి దగ్గరికి వచ్చారు. వారి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో అక్కడే వున్న ఇతరులను ఫొటో తీయమని కోరారు. అంతసేపు అక్కడే ఎమ్మెల్యే నిల్చుని వారితో ఫొటో దిగారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో ఫొటో తీసుకోవడంతో జ్యోతి, రవళి సంతోషం వ్యక్తం చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న మాలధారులు, భక్తులు

వైభవంగా అయ్యప్ప ఆరట్టు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మందిరం వద్ద స్వామివిగ్రహానికి అభిషేకం చేశారు. వైశ్య సంఘం కల్యాణమండపంలో పూజ నిర్వహించి పడిని వెలిగించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. చంద్రం గురుస్వామితోపాటు మాలధారులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దంపతులు

పడిపూజ..

బాన్సువాడ : అయ్యప్ప స్వామి పడిపూజను బాన్సువాడలోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులతోపాటు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులు పూజలో పాల్గొన్నారు. అనంతరం గురుస్వాములు, వేదపండితులను సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.